సాక్షి కర్నూలు

శనివారం । 6 । మే । 2023



భ్రామరికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీ భ్రమరాంబాదేవికి ఊయల, పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సహస్ర నామ పూజలు చేశారు.



నమో..నారసింహా

ఆళ్లగడ్డ: నరసింహస్వామి జయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఎగువ అహోబిలంలో గురువారం అర్ధరాత్రి అనంతరం గరుడ వాహనంపై అహోబిలేశుడు విహరించారు.



కుండపోత వర్షం

ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతుండగా.. భూగర్భ జలాల గణనీయంగా పెరిగాయి.

IIలో▸

న్యూస్‌రీల్

రేపు ఏడు కేంద్రాల్లో 'నీట్'

కర్నూలు(సిటీ): వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయస్థాయిలో నిర్వహించే నీట్(నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) రేపు (ఆదివారం) నిర్వహించనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో పరీక్ష నిర్వహించేవారు. ఈ ఏడాది కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వేర్వేరుగా జరుపుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎ.క్యాంప్ మాంటిస్సోరి హైస్కూల్, మాంటి (ఇండస్) ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజ్, శ్రీలక్ష్మి హైస్కూల్, కేవీఆర్ డిగ్రీ కాలేజ్, మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో సుమారుగా పది వేల మంది విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో పరీక్ష రాయనున్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి నగరంలోని ఓ కాలేజీలో పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

సిల్వర్‌సెట్‌కు దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(సిటీ): సిల్వర్‌జూబ్లీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న సిల్వర్‌సెట్‌కు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు పెంచారు. ఈ మేరకు సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరికొంతమందికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో గడువు పెంచినట్లు ఆయన తెలిపారు.

టీబీ ప్రొఫెసర్ వెంకటరావు బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని టీబీసీడీ ప్రొఫెసర్, హెచ్‌వోడి డాక్టర్ ఎం.వెంకటరావు బదిలీ అయ్యారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్‌లో భాగంగా ఆయనను విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీకి.. అక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఎ.ఎస్.శ్రీకాంత్ కర్నూలుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం టీబీసీడీ/పల్మనరీ మెడిసిన్ విభాగం హెచ్‌వోడిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. వేణుగోపాల్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

నగరం.. నందనవనం

- రూ.505 కోట్లతో కర్నూలులో అభివృద్ధి పనులు
- స్వచ్ఛతలో రాష్ట్రంలో రెండో స్థానం
- టీడీపీ హయంలో అరకొర నిధులు
- వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతి పరుగులు

కర్నూలు (టౌన్): రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు నగర అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వేగంగా మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తోంది. నగర ప్రజలు ఆహ్లాదకరంగా జీవనం సాగించేందుకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది. నగరంలోని 52 వార్డులకు మంచినీటిని అందించేందుకు సుంకేసుల నుంచి 23 కిలో మీటర్ల పరిధిలో ఏలాంటి చౌర్యం లేకుండా రూ.82 కోట్లతో పైపులైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. అలాగే ప్రతి ఒక్కరికి శుద్ధి చేసిన నీటిని అందించేందుకు రూ.15 కోట్లతో మునగాలపాడు వద్ద చేపట్టిన ట్రీట్‌మెంటు ప్లాంటు నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి.

సుందరంగా పార్కులు

14, 15వ ఆర్థిక సంఘం నిధులతో కర్నూలులో పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నారు. రూ. 8 కోట్లతో చాణిక్యపురి కాలనీలో కార్టున్ థీమ్ పార్కు, ఎస్‌బిఐ కాలనీలో మ్యూజిక్ థీమ్ పార్కు, గఫూర్ నగర్‌లో సైన్సు పార్కు, డాక్టర్స్ కాలనీలో కల్చరల్ పార్కు , అలాగే గ్లో గార్డెన్ పార్కులను తీర్చిదిద్దారు. నగరంలోని 119 కిలో మీటర్ల పరిధిలో విస్తరించిన రోడ్లలో డివైడర్లకు రూ.50 లక్షలు వెచ్చించి రంగులు, బొమ్మలు వేశారు. ఇప్పటి వరకు



కర్నూలు వాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కు

75 వేల మొక్కలు నాటారు. ఎక్కడ చూసినా పచ్చదనంతో నగరానికి కొత్త అందం వచ్చింది.

ఇవీ అభివృద్ధి పనులు..

- రూ.8 కోట్లతో వెంకటరమణ కాలనీలో నూతనంగా నగరపాలక మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు.
- జొహరాపురంలో రూ.1.30 కోట్లతో రెండు ఇండోర్ స్టేడియాల నిర్మాణ పనులు పూర్తి చేశారు. అదే ప్రాంతంలోరూ. కోటి వెచ్చించి 1.45 ఎకరాల్లో క్రికెట్ ప్రాక్టీసు కోర్టు, టెన్నిస్ కోర్టు నిర్మాణాలు చేపట్టనున్నారు.
- నగరంలో పాతబస్తీ నుంచి జొహరాపురానికి వెళ్లేందుకు రూ.34 కోట్లతో నూతనంగా కాజ్‌వే నిర్మించి, ప్రారంభించారు.
- రూ. 10 కోట్లు వెచ్చించి 12 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల పనులు పూర్తి చేశారు.



పాతబస్తీ నుంచి జొహరాపురానికి వెళ్లేందుకు నూతనంగా నిర్మించిన బ్రిడ్జి

స్వచ్ఛతలో మెరిసి..

జాతీయ స్థాయి స్వచ్ఛత అవార్డుల్లో కర్నూలు నగరానికి రాష్ట్రంలో రెండో స్థానం లభించింది. పారిశుద్ధ్యంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. పకడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. ఎక్కడ చెత్త దిబ్బలు లేకుండా డస్ట్‌బిన్లు తొలగించారు. నగరశివారులోని జొహరాపురం నుంచి గార్బేజీని



చురుగ్గా సాగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు

గార్గేయపురానికి తరలించారు. ఇంటింటికి చెత్త డబ్బాలు పంపిణీ చేశారు. 45 కొత్త వాహనాలు కొనుగోలు చేశారు. ప్రతి డివిజన్ పరిధిలో రూ.10 లక్షలతో నూతనంగా శానిటరీ భవనాలు నిర్మించారు.

రూ.26 కోట్లతో నగరపాలక నూతన భవన నిర్మాణం

50 ఏళ్ల క్రితం నిర్మించిన నగరపాలక కార్యాలయం ప్రస్తుత పరిస్థితులకు సరిపోవడం లేదు. దీంతో నూతన పాలక వర్గం సమస్యను గుర్తించి రూ.26 కోట్లు వెచ్చించి ఇదే కాంప్లెక్స్‌లోనే కాధునిక వసతులతో నూతన నగర పాలక కార్యాలయం నిర్మాణం చేపడుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో మున్సిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నగరపాలక కార్యాలయంలో పాత భవనాలు తొలగించి నూతన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

27 వేల మందికి ఇళ్ల పట్టాలు

కర్నూలు నగరంలో ఇళ్లు లేని పేదలు ఉండకూడదని ప్రభుత్వం 27 వేల మంది ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. జగన్నాథ గట్టు వద్ద అసంపూర్తిగా ఉన్న టిడ్కో అపార్టుమెంట్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. వీటిని 4,500 మంది పేదలకు మంజూరు చేశారు.



రూపుదిద్దుకుంటున్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

మరింత అభివృద్ధి చేస్తాం



టీడీపీ హయాంలో కర్నూలు నగర అభివృద్ధిని పట్టించుకోలేదు. మేం అధికారంలోకి వచ్చిన తరువాత పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చాం. ఎక్కడా చెత్త దిబ్బ కనిపించకుండా చర్యలు తీసుకున్నాం. నగరాన్ని పచ్చదనంతో నింపాం. స్వచ్ఛతలో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిపాం. పార్కులను అందంగా తీర్చిదిద్దాం. తుంగభద్ర నది ప్రాంతంలో ఆహ్లాదం కోసం పార్కు, సైక్లింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.115 కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తాం.

– బీవై రామయ్య, కర్నూలు నగర మేయర్

ఆగిపోయిన పనులు పూర్తి చేశాం



టీడీపీ హయాంలో నగరంలో సగం పనులు చేసి వదిలేశారు. ఆగిపోయిన పనులను కర్నూలు, నంద్యాల ఎంపీల సహకారంతో పూర్తి చేస్తున్నాం. జొహరాపురం బ్రిడ్జి, రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఉన్న బ్రిడ్జి, వెంకటరమణ కాలనీవద్ద ఉన్న బ్రిడ్జీలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశాం. నగరంలో 12 అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించాం. కర్నూలు వైద్య కళాశాలలో రూ.12.90 కోట్లతో నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్ ప్రారంభించాం.

– హఫీజ్‌ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్న నిధులు

- జనరల్ ఫండు కింద ఖర్చు చేస్తున్నది: రూ. 116 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.45.60 కోట్లు
- డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లుకు: రూ.10 కోట్లు
- అమృత్ పథకం రెండో దశ కింద పైపులైన్ పనులకు: రూ.82 కోట్లు
- మంచి నీటి సరఫరాకు: రూ.115 కోట్లు
- ఎస్‌టీపీలు (సేవేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్‌లు): రూ. 131 కోట్లు
- నీటి శుద్ధి, పర్యవేక్షణ, సిల్ట్ తొలగించే పనులకు: రూ.5.20 కోట్లు

టీడీపీ హయాంలో ఇలా...

- 2010 ఆగస్టులో కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించి శిలాఫలకం ఏర్పాటు చేసింది. ఆ తరువాత చేతులెత్తేసింది.
- 2016–17లో జగన్నాథ గట్టు వద్ద ఎన్‌టీఆర్ నగర్ పేరుతో అపార్టుమెంట్లు నిర్మించింది. రోడ్లు లేవు. మంచినీళ్లు లేవు. కరెంటు లేదు. ప్రహరీ లేదు. నిధుల సమస్యతో పనులు నిలిచిపోయాయి.
- 2017–18లో కర్నూలు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఆనంద్ టాకీస్ నుంచి కిసాన్ ఘాట్ మీదుగా వెళ్లేందుకు హంద్రీ నది వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. పూర్తి కాకుండానే పనులు నిలిచిపోయాయి.
- అదే ఏడాదిలోనే జొహరాపురం నుంచి పాతబస్తీకి వెళ్లేందుకు కాజ్‌వే నిర్మించాలని పనులు చేపట్టి మధ్యలో అపేశారు.
- ఇలా అనేక పనులు టీడీపీ హయాంలో నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- బ్యాంకుల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు
- ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సెక్రటరీ చిరంజీవి చౌదరి

కర్నూలు(అగ్రికల్చర్): ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సెక్రటరీ, మార్కెటింగ్, సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లాలో పర్యటించారు. అనంతరం కర్నూలులోని ఉద్యాన భవన్‌లో పొదుపు మహిళలు, రైతు ఉత్పత్తి దారుల సంఘాల ప్రతినిధులతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు ఇస్తున్నాయన్నారు. ఏపీఎంఎంఈ ద్వారా సబ్సిడీలు అందిస్తున్నట్లు చెప్పారు. మహారాష్ట్రకు చెందిన ఎస్4ఎస్ కంపెనీ అవసరమైన సాంకేతికతను అందచేస్తుందని స్పష్టం చేశారు. తడకనపల్లిలో 25 సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లును ఏర్పాటు చేశామని, అవి చక్కగా పనిచేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో వీటిని పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లాలో పెద్ద ఎత్తున ఉల్లి స్టోరేజీ గోదాములు నిర్మిస్తున్నామని, వీటిలో 90 రోజుల వరకు నిల్వ చేసుకోవచ్చన్నారు. ఉల్లి, టమాట ఆధారిత ఉత్పత్తులకే పరిమితం కాకుండా పీఎంఎఫ్ఎం ఈ ద్వారా గ్రామాల్లో ఇతర విలువ ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ..ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుతో వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ వచ్చి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. తడకనపల్లి మహిళలు పాలకోవా, వెజిటబుల్ సోలార్ డ్రైయర్ల ద్వారా రాణిస్తుండటం అభినందనీయమన్నారు. సమావేశంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఇవో శ్రీధర్, ఏపీ మాస్ చైర్మన్ సీఎస్ రెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ఈడీ ఉమాదేవి, కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ రామాంజనేయులు, ఉద్యాన శాఖ ఏడీ రామాంజనేయులు, ఏపీఎంబిపీ ఏపీడీ రాజాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరంజీవి చౌదరి

మరో 23 మమదికి యూనిట్లు

కల్లూరు మండలం తడకనపల్లిలో వెజిటబుల్ సోలార్ డ్రైయర్స్ ద్వారా ఉల్లి, టమాటలో ఫ్లేక్స్ తయారీని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. సోలార్ డ్రైయర్ల ద్వారా ఉపాధి పొందుతున్న పొదుపు మహిళలతో మాట్లాడారు. ప్రస్తుతం 25 మంది మహిళలు సోలార్ డీహైడ్రేషన్ యూనిట్లలో రాణిస్తుండగా, మరో 23 మందికి యూనిట్లు మంజూరు చేస్తూ ఒక్కొక్కరికి రూ.2 లక్షల ప్రకారం రుణాలను ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సెక్రటరీ చిరంజీవి చౌదరి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్లు కూడా అందచేశారు. తడకనపల్లిలో ఏర్పాటైన పశువుల హాస్టల్‌ను వారు పరిశీలించారు.

చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా

కర్నూలు: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిరంతరం నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. క్షేత్రగుడి, చింతకుంట చెక్‌పోస్టులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ వెంట ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

ఆలూరు: అసాంఘిక కార్యకలాపాలను ప్రేరేపించే శక్తులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఎస్పీ జి. కృష్ణకాంత్ ఆదేశించారు. ఆస్పరి పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని ఎస్‌ఐ వరప్రసాద్‌కు సూచించారు.



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

పేదలకు వరం కల్యాణమస్తు

- షాదీతోఫాతో ముస్లిం మైనార్టీ వర్గాలకు ఊరట
- జిల్లాలో 574 మంది లబ్ధిదారులకు రూ.4.26 కోట్ల సాయం
- లబ్ధిదారులకు మెగా చెక్ అందించిన కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ సుజన, చిత్రంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కాటసాని తదితరులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం పేదలకు వరం లాంటిదని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్, సుధాకర్, మేయర్ రామయ్య అన్నారు. శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకం లబ్ధిదారులకు బటన్‌నొక్కి నగదును జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ప్రజాప్రతినిధులతోపాటు లబ్ధిదారులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. ఈ పథకానికి జనవరి–మార్చి త్రైమాసికంలో 574 మంది ఎంపికైనట్లు చెప్పారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4.26 కోట్లను కేటాయించిందన్నారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో 17 వేల మందికి పెళ్లికానుక ఇస్తామని చెప్పి మోసం చేశారని, అదే జగనన్న పాలనలో ప్రతి త్రైమాసికానికి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత జగనన్న పాలనను ప్రజలే బేరీజు వేసుకోవాలని సూచించారు.


బాల్య వివాహాలు తగ్గించడమే లక్ష్యం..

పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా బాల్య వివాహాలను తగ్గించవచ్చని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పేదింటి ఆడపడుచుల పెళ్లిళ్లకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల్లో అత్యధికులు పేదలే ఉంటారని, వారు తమ పిల్లలకు పెళ్లి చేయడానికి ఇబ్బందులు పడుతుంటారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గమనించి షాదీతోఫా పథకం ద్వారా ఆ ఇబ్బందులు తొలగించారన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వానికి రారాజు అన్నారు. పేదలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా పాలన చేస్తున్నారని కొనియాడారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఆడ పిల్లల పెళ్లిళ్లంటే భయపడే పరిస్థితి నుంచి ధైర్యంగా వివాహం చేసే రోజులు వచ్చాయన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల బాధలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీరుస్తున్నారన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, డీఆర్‌డీఏ పీడీ ఎం.వెంకటసుబ్బయ్య, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు.

వర్గాల వారీగా లబ్ధి పొందిన వారి వివరాలు

వర్గం	ఒక్కొక్కరికి ఇచ్చే మొత్తం	లబ్ధిదారుల సంఖ్య
బీసీలు	రూ.50,000	305
బీసీ కులాంతర వివాహం	రూ.75,000	5
విభిన్నప్రతిభావంతులు	రూ.1,50,000	6
మైనార్టీలు	రూ.1,00,000	99
ఎస్సీలు	రూ.1,00,000	152
ఎస్సీ కులాంతర వివాహం	రూ.1,20,000	3
ఎస్టీలు	రూ.1,00,000	12

చాలా సంతోషంగా ఉంది



జగనన్న సంక్షేమ పథకాల ద్వారా మా కుటుంబం ప్రతి ఏటా రూ.80 వేల ఆర్థిక సాయాన్ని అందుకుంటోంది. మా తండ్రికి ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా బైపాస్ సర్జరీ చేయించుకున్నాం. రైతు భరోసా ద్వారా ఏటా రూ.13500 అందుతోంది. మా అన్నకు వాహన మిత్ర వర్తించింది. నేను డిగ్రీ వరకు చదువుకున్నాను. నాకు జగనన్న వసతి, విద్యా దీవెన పథకాలు అందాయి. ఇటీవల నేను వివాహం చేసుకున్నాను. మేము బీసీ కులస్తులం కావడంతో వైఎస్ఆర్ కల్యాణ మస్తు కింద రూ.50 వేల ప్రోత్సాహం అందింది. చాలా సంతోషంగా ఉంది.

– బోయ పుణ్యవతి, ఉలిందకొండ, కల్లూరు మండలం

పేదలకు ఎంతో మేలు చేస్తున్నారు



మా తండ్రి షేక్ ఖాదర్ ఇళ్లకు పెయింట్ వేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎన్ని కష్టాలు ఉన్నా చెల్లెల్ని, నన్ను చదివించారు. మా చెల్లెలికి అమ్మ ఒడి కింద రూ.15వేలు అందుతోంది. మా అమ్మకు ఆసరా పథకం వస్తోంది. నేను ఇటీవల వివాహం చేసుకోవడంతో వైఎస్సార్ షాదీ తోఫా కింద రూ.లక్ష వచ్చింది. పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేస్తున్నారు. దేశంలో జగనన్న బెస్టు సీఎం.

– షేక్ మాలన్, బుధవార పేట, కర్నూలు

క్లుప్తంగా

మోటారు మరమ్మతులపై ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రిక్ మోటారు రీవైండింగ్, రిపేర్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 18 నుంచి 45 ఏళ్లలోపు వారు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నంలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన ఉన్న కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన మూడో అంతస్తులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అందచేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000710508 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

అరుణాచలానికి ఇంద్ర ఏసీ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం ఈ నెల 13వ తేదీన ఇంద్ర ఏసీ ప్రత్యేక బస్సు (సర్వీస్ నంబర్-93998)ను నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు శనివారం ఉదయం 7గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి కాణిపాక దర్శనం అనంతరం రాత్రి 8 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బయలుదేరి, దారిలో వేలూరు స్వర్ణ దేవాలయ అమ్మవారి దర్శనం అనంతరం సోమవారం ఉదయం 6గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం ప్రత్యేక బస్సు చార్జీ రూ.2,500 ఉంటుందని, ఇందులో ముందస్తు టిక్కెట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు 9959225794, 7382871131 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి బలవన్మరణం


రాము (ఫైల్)

ఆదోని టౌన్: పట్టణంలోని కార్వన్‌పేట కరీం దివాన్ దర్గా ఏరియాలో నివాసముంటున్న కంది రాము(42) గురువారం రాత్రి రైలు కింద పడి బలవన్మరణం చెందాడు. రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపినప వివరాలు.. కంది రాము చందాసా దర్గాలో షెడ్ వేసుకుని సప్లయిర్ షాపు, జిరాక్స్ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న దుకాణాలను ఖాళీ చేయాలని యజమానులు ఒత్తిడి చేయడంతో ఏమి చేయాలో తోచక అఘాయిత్యానికి పాల్పడినట్లు మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు చేశాడని, మృతుడి జేబులో తన చావుకు కారణం పాన్‌షాపు సలీం, చోటు అని రాసివున్న లెటర్ లభించిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. పోస్ట్ మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కుండపోత వర్షం

హాలహర్విలో 10.3 సెం.మీ వర్షపాతం
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- రానున్న నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం


మద్దికెరలో ఓ పొలం గట్టు నుంచి పారుతున్న వర్షం నీరు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. గత పదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కురుస్తున్న వర్షాలతో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. సాధారణంగా వేసవిలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ సారి భారీ నుంచి కుండపోత వర్షాల కారణంగా దాదాపు ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించకపోవడం విశేషం. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతుండగా.. భూగర్భ జలాల గణనీయంగా పెరిగాయి. ఫలితంగా బావులు, బోర్ల కింద కూరగాయలు, ఇతర పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వైశాఖ మాసంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. అయితే వర్షాలు పడటం వల్ల వేసవి చల్లారినట్లయింది. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని 20 మండలాల్లో వర్షాలు కురిశాయి. ఒకటి, రెండు మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. హాలహర్విలో అత్యధికంగా 103.4 మి.మీ., (10.3 సెం.మీ) వర్షపాతం నమోదైంది. మద్దికెరలో 96.2, ఆలూరు 50.4, ఎమ్మిగనూరు 33.6, ఆస్పరి 21.4, పత్తికొండ 18.2, తుగ్గలిలో 18.2 మి.మీ., వర్షం కురిసింది. జిల్లా మొత్తంగా సగటున 15.5 మిమీ వర్షపాతం నమోదైంది. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మిమీ ఉండగా.. మొదటి వారంలోపే 53.9 మి.మీ., వర్షపాతం నమోదు కావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

రానున్న రోజుల్లో భారీ వర్షాలు

రానున్న నాలుగైదు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఆగ్నేయ బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావం వల్ల రాయలసీమ జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. తుపాను ప్రభావం శనివారం నుంచి ఉండే అవకాశం ఉందని, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

పల్లెల్లో అభివృద్ధి పనులకు నిధులు


తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో పూర్తి కావచ్చిన ఆర్‌బీకే భవనం

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రాధాన్యత భవన(ఆర్‌బీకే, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ కేంద్రాలు) నిర్మాణాలు, సీసీ రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం పీఆర్ ఎస్‌ఈ కె.సుబ్రమణ్యం విలేకరులతో మాట్లాడుతూ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు సంబంధించి రూ.26.10 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేయగా, రూ.16.96 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అలాగే సీసీ రోడ్లకు రూ.6.78 కోట్ల బిల్లులకు గాను రూ.2.37 కోట్లు విడుదలయ్యాయన్నారు. జిల్లాలోని రూఫ్ లెవెల్, పూర్తి కావచ్చిన భవన నిర్మాణాలకు ఆయా దశల ఆధారంగా నెలవారీ బిల్లులు చెల్లించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారన్నారు.

వ్యక్తి ఆత్మహత్య?


మద్దిలేటి (ఫైల్)

బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన బరగొడ్ల మద్దిలేటి(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మద్దిలేటి మందులు వాడుతున్నాడు. ఈనెల 3న మందులు తెచ్చుకునేందుకని బయటకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా ఆరా తీస్తుండగా శుక్రవారం ఉదయం చెట్టుకు విగత జీవిగా వేలాడుతూ ఉన్నాడని సమాచారం అందడంతో భార్య సువర్ణమ్మ అక్కడికి చేరుకుని విలపించింది.

బతుకుదెరువు కోసం వచ్చి..

అవుకు మండలం మంగంపేట గ్రామానికి చెందిన మద్దిలేటి, సువర్ణమ్మ దంపతులు బతుకు దెరువు కోసం 20 ఏళ్ల క్రితం నందవరం గ్రామానికి వచ్చారు. మద్దిలేటి డోజర్ డ్రైవర్‌గా, సువర్ణమ్మ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఇటీవల పొదుపు లక్ష్మి డబ్బుల విషయంలో కొందరితో గొడవ పడటం తప్ప ఎలాంటి వివాదాలకు పోయే వ్యక్తి కాదని పలువురు పేర్కొంటున్నారు.

ఉరి తీరు అనుమానాస్పదం..

ఆటుగా వెళ్లిన గొర్రెల కాపరులు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాళ్లు, చేతులు కట్టేసి ఉన్న తీరును చూసి ఎవరైనా ఉరి వేసి చంపారా అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేశారు. కాగా భార్య సువర్ణమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని, ఆత్మహత్యా, హత్యా అనేది దర్యాప్తులో తెలుస్తుందని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

వెదురు బొంగుల వేలం

రుద్రవరం: స్థానిక కలప డిపోలో శుక్రవారం డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ వెదురు బొంగులకు వేలం నిర్వహించారు. ఏటా అక్టోబర్ నుంచి జూన్ మాసం వరకు రుద్రవరం రేంజిలో వెదురు సేకరణ, వేలం పాటలు సాగేవి. ఈ ఏడాది మేలో వెదరు సేకరణ ప్రానరంభం కావడంతో శుక్రవారం మొదటి వేలం పాటలు నిర్వహించారు. రెండో తరగతికి చెందిన 13,500 వెదుర్లకు వేలం నిర్వహించగా రూ.4,80,900 ఆదాయం వచ్చినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. వేలం పాటల్లో రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజావలి, ఫారెస్టర్లు పాల్గొన్నారు.


టీడీపీ హయాం: విత్తనాల కోసం చుట్టుపక్క గ్రామాల రైతులు హొళగుందకు వచ్చి రోడ్డుపై ముళ్లకంచె వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: చిన్నహ్యాట గ్రామంలోనే రైతులకు ఎరువుల పంపిణీ దృశ్యం

పాలన చేరువై.. ప్రజల గుండెల్లో కొలువై!


టీడీపీ హయాం: హొళగుందలో పింఛన్‌ల కోసం నిరీక్షణ


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: పెద్దగోనెహాళ్‌లో పొలం వద్దకే వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎలాంటి ఇక్కట్లు ఎదుర్కొన్నారో, ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో కళ్ల ముందు కనిపిస్తోంది. ఒకప్పుడు విత్తనాలు కావాలంటే చాతాండు క్యూలు, ఊళ్లలో పనులు వదులుకొని మండల కేంద్రాల్లో పాసు పుస్తకాలను క్యూలో పెట్టి నీడపాటున నిరీక్షిస్తున్న దృశ్యాలు తలుచుకుంటేనే చెమటలు పడతాయి. ఇక పింఛన్ల విషయానికొస్తే పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో పాటు ఆ ప్రాంతం జాతరను తలపించేది. ఇదే సమయంలో ట్యాబ్‌లు పనిచేయక, నెట్‌వర్క్ సమస్యతో ఆ రోజు పింఛను ఇస్తారో లేదో తెలియక వృద్ధులు, వికలాంగులు నిట్టూరుస్తూ ఇళ్లకు చేరుకోవడం చూశాం. ఇప్పుడు ఏ పథకమైనా ఇంటి తలుపు తడుతోంది. వలంటీర్లు ఒకటో తేదీన ఠంచనుగా ఉదయాన్నే తలుపుతట్టి మరీ పింఛను చేతికందిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు కోసం ఎక్కడెక్కడో తిరిగే పనిలేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రం రైతులకు దన్నుగా నిలుస్తున్నాయి. ఇంతేకాదు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరు ఒకరు చెప్పడం కాదు, ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపిస్తుండటంతో ప్రతిపక్షాల నోళ్లు మూతపడుతున్నాయి. – హొళగుంద


టీడీపీ హయాం: అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి(ఫైల్)


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం: నేడు అన్ని వసతులతో రూపుదిద్దుకుంటున్న సీసీ రోడ్డు

అంతర్గత రోడ్లకు వీడిన గ్రహణం

కోవెలకుంట్ల మండలం కలుగొట్ల గ్రామంలో సుమారు 50 ఏళ్లుగా పెండింగ్‌లోని అంతర్గత రోడ్లకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రహణం వీడింది. గ్రామంలోని పలు కాలనీల్లో ఏళ్ల తరబడి రోడ్లు సరిగా లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజలకు మంచి రోజులు వచ్చాయి. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో కోటి రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటవుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – కోవెలకుంట్ల

బాలాజీ నగర్‌లో భారీ చోరీ

కర్నూలు: స్థానిక బాలాజీ నగర్‌లో భారీ చోరీ జరిగింది. కేశవ అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులోని ఫ్లాట్ నంబర్ 402లో భూపాల్‌రెడ్డి, సుకన్య దంపతులు నివాసముంటున్నారు. సుకన్య నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో 8 నెలలుగా అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి విధుల నిమిత్తం నంద్యాలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దోచుకుని పరారయ్యారు. ప్రధాన వాకిలికి వేసిన తాళాలు పగులగొట్టి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుగొట్టి అందులో ఉన్న 42 తులాల బంగారు నగలను మూటగట్టుకుని ఉడాయించారు. సుకన్య సాయంత్రం తిరిగి వచ్చే సరికి తలుపులు తెరిచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామగ్రి చిందరవందరగా పడివున్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని శుక్రవారం ఉదయం కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలనరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. నేరం జరిగిన తీరును పరిశీలించి ఇరుగుపొరుగు వారితో చోరీ విషయంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

- వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్


మాట్లాడుతున్న డాక్టర్ దేవసాగర్

కర్నూలు(హాస్పిటల్): వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరూ ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ యాప్ ద్వారా హాజరు వేసి సమయపాలన పాటించాలని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రామ్ అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ ఆఫీసర్, ఎల్‌ఎంహెచ్‌పీ, ఏఎన్‌ఎం యాప్‌లలో వారికి పొందుపరిచిన ఆరోగ్యసేవల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రోగ్రామ్ అధికారులు వారి పరిధిలోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరువేసేలా చూడాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్‌మాత్రలు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్సలు అందించి వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్, సిమ్‌కార్డులను విధిగా వాడేలా చూడాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్స్‌లను ప్రోగ్రామ్ అధికారులు సందర్శించి అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించి తగిన నివేదికలను ప్రతి శనివారం సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీటీసీఓ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఏఓ డాక్టర్ నాగప్రసాద్, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, ఫ్యామిలి ఫిజిషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, కంటివెలుగు కో ఆర్డినేటర్ డాక్టర్ జి.భరత్, మలేరియా అధికారి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

తేరు.. భక్తజన హోరు


భక్తజన సందోహం మధ్య కోసిగయ్య రథోత్సవం

కోసిగి(మంత్రాలయం): శ్రీ ఆంజనేయ స్వామి (కోసిగయ్య) మహా రథోత్సవం శుక్రవారం సాయంత్రంలో కోసిగిలో వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. సంప్రదాయం ప్రకారం సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన కుమారులు శ్రీనివాస రాజు దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఊరేగింపుగా రథం వద్దకు వచ్చారు. ఉత్సవమూర్తులకు పూజలు చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని లాగుతూ.. రథంపైకి అరటి, మామిడి పళ్లు విసిరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

కోసిగి(మంత్రాలయం): శ్రీ ఆంజనేయ స్వామి (కోసిగయ్య) మహా రథోత్సవం శుక్రవారం సాయంత్రంలో కోసిగిలో వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. సంప్రదాయం ప్రకారం సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన కుమారులు శ్రీనివాస రాజు దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఊరేగింపుగా రథం వద్దకు వచ్చారు. ఉత్సవమూర్తులకు పూజలు చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం రథోత్సవం ప్రారంభమైంది. రథాన్ని లాగుతూ.. రథంపైకి అరటి, మామిడి పళ్లు విసిరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో ఆలయ ఈఓ దినేష్‌కుమార్, ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
695	187
61,054	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	12,210	▲ 224
డోజోన్స్	33,580	▲ 453
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,778	▲ 76
డాక్స్	15,961	▲ 227
షాంఘై	3,334	▽ 16
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	▲ 35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 గ్రాములు)	61,923	▲ 277
బంగారం (99.5 గ్రాములు)	61,979	▲ 279
వెండి (కిలో)	76,794	▲ 330

ఒలెక్ట్రా ఆదాయం రూ. 376 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 376 కోట్ల ఆదాయం (కన్సాలిడేటెడ్)పై రూ. 27 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆదాయం రూ. 271 కోట్లుగా, లాభం రూ. 18 కోట్లుగా నమోదైంది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 84 శాతం ఎగసి రూ. 594 కోట్ల నుంచి రూ. 1,091 కోట్లకు చేరింది. నికర లాభం 86 శాతం వృద్ధితో రూ. 35 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు పెరిగింది. 2021–22లో 259 ఎలక్ట్రిక్ బస్సులు డెలివరీ చేయగా, 2022–23లో 117 శాతం అధికంగా 563 ఈ–బస్సులను అందించినట్లు సంస్థ తెలిపింది. మొత్తం 3,394 బస్సుల కోసం ఆర్డర్లు ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రిక్ టిప్పర్లను కూడా విక్రయించడం ప్రారంభించామని, క్యూ4లో 17 వాహనాలను డెలివరీ చేశామని పేర్కొంది. సరఫరా వ్యవస్థ, స్థూల పరిస్థితులపరమైన రిస్కులు నెలకొన్నప్పటికీ తాము తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి. ప్రదీప్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల విభాగంలో అగ్రగామిగా కొనసాగేందుకు ఇది తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

పతంజలి 'వెయిట్‌గో' తో సత్ఫలితాలు

హైదరాబాద్: బరువు తగ్గించడంలో తాము అభివృద్ధి చేసిన 'దివ్య వెయిట్‌గో' సత్ఫలితాలను ఇస్తున్నట్లు పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ తెలిపింది. తేలిక పాటి వ్యాయామాలు చేస్తూ, ఈ ఆయుర్వేదిక్ ఔషధాన్ని వినియోగిస్తే శరీరంలోని కొలెస్ట్రాల్, గ్లూకోజ్, ఇన్సులిన్‌లను తగిన స్థాయిల్లో ఉండేలా చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిష్టాత్మక అంతర్జాతీయ జర్నల్ 'బయోమెడిషన్ అండ్ ఫార్మాకో థెరపీ'లో ఈ ఔషధం పనితీరు గురించి ప్రచురితమైనట్లు వివరించింది.



మనీ లాండరింగ్ పరిధిలోకి సీఏలు

- పీఎంఎల్ఏ కిందికి కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు
- అయిదు రకాల ఆర్థిక లావాదేవీలకు వర్తింపు
- కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నల్ల ధనం చలామణీ, మనీ లాండరింగ్ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా మరో కీలక చర్య తీసుకుంది. బ్లాక్ మనీ చలామణీకి ఆస్కారం ఉండే అయిదు రకాల ఆర్థిక లావాదేవీలను, వాటిని క్లయింట్ల తరఫున నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలను మనీ–లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) పరిధిలోకి చేర్చింది. దీంతో ఇకపై సదరు లావాదేవీలను నిర్వహించే సీఏలు, సీఎస్‌లు కూడా విచారణ ఎదుర్కొనాల్సి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మే 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయం; క్లయింట్ల డబ్బు, సెక్యూరిటీలు లేదా ఇతర ఆస్తుల నిర్వహణ; బ్యాంక్, సేవింగ్స్ లేదా సెక్యూరిటీస్ అకౌంట్ల నిర్వహణ; కంపెనీల ఏర్పాటు, నిర్వహణ కోసం నిధులు సమీకరించడంలో తోడ్పాటు; వ్యాపార సంస్థల కొనుగోళ్లు, విక్రయం.. మొదలైన అయిదు రకాల ఆర్థిక లావాదేవీలు ఇందులో ఉన్నాయి. పీఎంఎల్ఏ చట్టం 2002ను ప్రయోగించాల్సి వస్తే క్లయింట్ల స్థాయిలోనే సీఏలు కూడా జరిమానా, విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'పీఎంఎల్ఏ నిబంధనలను అమలు చేస్తే క్లయింట్లతో సమానంగా సీఏలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా లావాదేవీ జరిగినట్లుగా భావిస్తే ఆ విషయాన్ని సీఏలు వెంటనే నియంత్రణా సంస్థకు తెలియజేయాలి' అని వివరించాయి.

రిపోర్టింగ్ అధికారులుగా సీఏలు..

ఆయా లావాదేవీల విషయంలో సీఏలు ఇకపై నియంత్రణ సంస్థలకు తెలియజేయాల్సిన రిపోర్టింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) పేర్కొంది. సదరు లావాదేవీలు నిర్వహించే క్లయింట్లందరి వివరాలను సేకరించి (కేవైసీ), రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపింది. క్లయింట్ల తరఫున ఏయే ఆర్థిక లావాదేవీలు జరపకుండా నిషేధం ఉందనే దాని గురించి తమ సభ్యుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీఏఐ వివరించింది. కొత్త మార్పులు సరైన కోణంలో అమలయ్యేలా చూసేందుకు, వృత్తి నిపుణులు పోషించగలిగే పాత్ర అర్థమయ్యేలా వివరించేందుకు నియంత్రణ సంస్థలు, అధికారులతో కలిసి పనిచేయనున్నట్లు ఐసీఏఐ తెలిపింది. నల్ల ధనం కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎంఎల్ఏ నిబంధనలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు .. రాజకీయాలతో ప్రమేయమున్న వ్యక్తుల (పీఈపీ) ఆర్థిక లావాదేవీలను రికార్డు చేయడాన్ని తప్పనిసరి చేసింది. అలాగే లాభాపేక్ష రహిత సంస్థల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని కూడా ఆర్థిక సంస్థలు, రిపోర్టింగ్ ఏజెన్సీలు సేకరించాల్సి ఉంటోంది. ఇక వర్చువల్ అసెట్స్ లావాదేవీలు నిర్వహించే క్రిప్టో ఎక్స్చేంజీలు, మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించే యూజర్ల వివరాలను సేకరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



ఫెడరల్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 954 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 954 కోట్ల నికర లాభం ఆర్జించింది. 62 శాతం ఎగసింది. ఇది ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదపడినట్లు బ్యాంక్ పేర్కొంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం ఎగసి రూ. 3,165 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) రూ. 1,970 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 25 శాతం పుంజుకుని రూ. 1,909 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం 58 శాతం ఎగసి రూ. 734 కోట్లను తాకింది. దీంతో రికార్డ్ లాభం ఆర్జించినట్లు బ్యాంక్ వెల్లడించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి.



సూచీలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షాక్..!

- వారాంతాన ఒక శాతం పతనమైన మార్కెట్
- సెన్సెక్స్ నష్టం 695 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల ద్వయం 66% పతనంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. విలీన ప్రక్రియ తర్వాత సుమారు 150 – 200 మిలియన్ డాలర్ల మేర అవుట్‌ఫ్లో ఉండొచ్చని ఎంఎస్‌సీఐ నివేదిక తెలపడంతో ఇరు కంపెనీల షేర్లు గడిచిన మూడేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. అలాగే అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ భయాలు, వాల్ స్ట్రీట్ నుంచి బలహీన సంకేతాలు, ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో పాటు వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు కీలక కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 586 పాయింట్ల నష్టంతో 61,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఒక దశలో 747 పాయింట్లు క్షీణించి 61,002 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 696 పాయింట్లు నష్టపోయి 61,054 వద్ద ముగిసింది. నిఫ్టీ 139 పాయింట్ల పతనంతో 18,117 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,217 – 18,055 పరిధిలో కదలాడింది. ఆఖరికి 187 పాయింట్లు నష్టపోయి 18,069 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, మీడియా, ఐటీ రంగాల షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్ల పతనంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.50%, 0.30% చొప్పున నష్టపోయాయి. కాగా ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానూ, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.43 లక్షల కోట్లు హరించుకుపోయింది.



- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.63% పతనంతో రూ.1625 వద్ద నిలిచింది. బ్యాంక్ రూ.56,228 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. హెచ్‌డీఎఫ్‌సీ 5.84% నష్టంతో రూ.1625 వద్ద క్లోజైంది. రూ.29,572 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది.

బంగారం డిమాండ్‌కు ధర సెగ

- భారత్ వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా
- జనవరి–మార్చిలో డిమాండ్ 17 శాతం డౌన్
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

ముంబై: దేశంలో బంగారం ధరలు తీవ్ర స్థాయికి చేరడంతో, జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ భారీగా 17 శాతం పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ధరల కారణంగా కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. 'మొదటి త్రైమాసికంలో పసిడి డిమాండ్ ట్రెండ్స్' పేరుతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన ఒక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు....

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో భారత్ పసిడి డిమండ్ 112.5 టన్నులు. 2022 ఇదే కాలంలో ఈ విలువ 135.5 టన్నులు.
- పసిడి ఆభరణాల డిమాండ్ ఇదే కాలంలో 94.2 టన్నుల నుంచి 78 టన్నులకు పడిపోయింది. 2010 నుంచి ఒక్క మహమ్మారి కరోనా కాలాన్ని మినహాయిస్తే పసిడి ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 100 టన్నుల దిగువకు పడిపోవడం ఇది నాల్గవసారి.



- విలువల రూపంలో చూస్తే, మొత్తంగా పసిడి కొనుగోళ్లు 9 శాతం క్షీణించి రూ.61,540 కోట్ల నుంచి రూ.56,220 కోట్లకు పడిపోయాయి.
- ఒక్క ఆభరణాల డిమాండ్ విలువల్లో చూస్తే, 9 శాతం పడిపోయి రూ.42,800 కోట్ల నుంచి రూ.39,000 కోట్లకు పడిపోయాయి.
- పెట్టుబడుల పరిమాణం పరంగా డిమాండ్ (కడ్డీలు, నాణేలు) 17 శాతం తగ్గి 41.3 టన్నుల నుంచి 34.4 టన్నులకు క్షీణించింది.

ప్రపంచ పసిడి డిమాండ్ కూడా మైనస్సే..

ఇదిలావుండగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా పసిడి డిమాండ్ మొదటి త్రైమాసికంలో బలహీనంగానే నమోదయ్యింది. 13 శాతం క్షీణతతో ఈ పరిమాణం 1,080.8 టన్నులుగా ఉంది.

రూపాయి ఎఫెక్ట్...



పసిడి ధరలు పెరడానికి అంతర్జాతీయ అంశాలు ప్రధాన కారణంగా కనబడుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు పెరుగుదలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. డాలర్ బలోపేతం, రూపాయి బలహీనత వంటి కారణాలతో గత ఏడాదితో పోల్చితే పసిడి ధర 19 శాతం పెరిగింది. పసిడి 10 గ్రాముల (స్వచ్ఛత) ధర రూ.60,000 పైన నిలకడగా కొనసాగుతోంది. ధర తీవ్రతతో తప్పనిసరి పసిడి అవసరాలకు వినియోగదారులు తమ పాత ఆభరణాల రీసైక్లింగ్, తద్వారా కొత్త కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విభాగంలో కొనుగోళ్ల పరిమాణాలు కొంత మెరుగుపడుతున్నాయి. డిమాండ్ వార్షికంగా 750 నుంచి 800 టన్నులు శ్రేణిలో నమోదుకావచ్చు.

– సోమసుందరం, డబ్ల్యూజీసీ భారత్ రీజినల్ సీఈఓ.

మే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు...

● వడదెబ్బ జాగ్రత్త పడదాం ఇలా...



ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఇంకా ఎండల్లో ఎక్కువ తిరగకుండా ఉండాలి. అధికంగా ఎండలో తిరగటంతో రక్తకణాలు కుంచించుకు పోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం.

ఎలా గుర్తించాలి?

● చర్మం పొడిబారుతుంది. కళ్లు మంటలు రావడం, గుంజినట్లు అవడం జరుగుతుంది. ● శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపుతప్పుతుంది. ● నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. ● వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. ● శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం వస్తుంది. ● దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు ఏర్పడుతుంది.

ఎవరిపై ఎక్కువ ప్రభావం?

60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగే వాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు జాగ్రత్తగా ఉండాలి. వేసవి లో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ముందుజాగ్రత్తలు ఏమిటి?

● ప్రతిరోజు మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి.● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి. ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. ● నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి. ● బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. ● అలాగే నీళ్ల బాటిల్ తీసుకెళ్లండి. ● మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు. ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడంవల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది. ● శరీరంలో నీటిశాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి. ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లి పాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి. ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది. ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, పండ్ల రసాలు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

● నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ తగలడం వలన కలిగిన బాధలు తగ్గుతాయి. ● వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటిమీద నీళ్లు చల్లుతూ ఉండాలి. నిమ్మరసంలో ఉప్పు కలిపి ఇవ్వాలి. ● కుమ్మున ఉడికించిన మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు. ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి. ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇస్తే ఉపశమనం కలుగుతుంది. ● తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి. ● లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి. ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగలో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి. ● వేడివేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి. ● బయటకు వెళ్లేటప్పుడు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది. ● వీలయినంత వరకు ఎండవేళలో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

కర్బూజ పండంటి ఆరోగ్యం

వేసవిలో మనకు అధికంగా దొరికే పండు ఖర్బూజ పండు. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కర్బూజలో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటిని తిరిగి అందించడంలో కర్బూజపండు బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు ముఖ్యంగా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.



- కర్బూజ పండులో ఎక్కువ శాతంగా ఉండే బీటాకెరోటిన్, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని తెల్ల రక్తకణాలను వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడతాయి.
- కర్బూజలో విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా పని చేసేలా ఉపయోగపడుతుంది.
- ఈ పండులో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వలన గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి, గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- తక్కువ క్యాలరీస్, ఎక్కువ పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- ఖర్బూజ జ్యూస్ తాగడం వలన మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణ శక్తిని మెరుగుపరుస్తుంది.
- ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యం, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది. వేసవిలో కర్బూజ పండు ముక్కలతోపాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

వ్యాధులనుంచి కాపాడుకుందాం

పోయిందనుకున్న కోవిడ్ ఇప్పుడు మళ్లీ ప్రభావం చూపిస్తోంది. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే భయ పడాల్సిందేమీ లేదు. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఒక్క కరోనానే కాదు, ఎన్నో అంటువ్యాధులు, ఇతర రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఏం చేయాలో తెలుసుకుందాం.



ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. మాంసం, బీన్స్ వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీర పనితీరును మెరుగుపరుస్తాయి. పసుపు, అల్లం, నిమ్మరసం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల ఆహారంలో అవి ఉండేలా చూసుకోవడం మంచిది.

వ్యాయామం

క్రమం తప్పకుండా చేసే ఏ తేలికపాటి వ్యాయామం అయినా సరే,రోగనిరోధకతను పెంచుతుంది. అందువల్ల ఏమీ చేయలేకపోయినా, కనీసం నడవడం వల్ల అయినా శరీరమంతటికీ రక్తప్రసరణ పెరుగుతుంది. అన్ని కణాలకూ ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి

ఒత్తిడి రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది మన శరీరంలో కార్టిసాల్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది రోగనిరోధక ప్రతిస్పందనను నెమ్మదింపజేస్తుంది. ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

ద్రవపదార్థాలు

మంచి ఆరోగ్యానికి, బలమైన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేందుకు శరీరం హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి నీరు ఎంతో సహాయపడుతుంది.

సరిపడా నిద్ర

ఆరోగ్యం బాగుండాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటుగా ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. తక్కువ నిద్రపోయేవారికి తొందరగా జలుబు లేదా ఫ్లూ వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక దూరాన్ని, శుచి, శుభ్రతలను పాటిస్తూ ఉండటం, జనసమూహంలోకి వెళ్లినప్పుడు మాస్కులు వేసుకోవడం అవసరం. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కోవిడ్ ఒక్కటే కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొందరగా దరిచేరవు.